
సాక్షి
అనంతపురం
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో సోమవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

విద్యార్థినుల భద్రతకు చర్యలు



విద్యార్థినులతో సమావేశమైన కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం రాత్రి సెంట్రల్ యూనివర్సిటీని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో వేర్వేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల హాస్టల్ వద్ద సెక్యూరిటీని యూనివర్సిటీ వారు ఏర్పాటు చేయాలన్నారు.వర్సిటీలో స్టూడెంట్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి వారం తహసీల్దార్ పుణ్యవతి యూనివర్సిటీని తనిఖీ చేస్తారన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఏర్పాటుపై వర్సిటీ ఉన్నతాధికారులకు సూచనలు చేశామని, తాము కూడా బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి, ఆర్డీఓ కేశవ నాయుడు, సీఐ కరుణాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి



గుమ్మఘట్ట: రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ

గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం: భూముల రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో జరుగుతున్న రీ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేస్తున్న సమయంలో రైతులకు నోటీసులు ఇవ్వాలన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయాల్లో పలు రికార్డులు పరిశీలించారు. బీటీ ప్రాజెక్టును సందర్శించి ఎన్ని ఎకరాల ఆయకట్టుకు నీరందించారని జలవనరులశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్లు శ్రీనివాసులు, సుమతి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించమని కోరితే షోకాజ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు సక్రమంగా చెల్లించమని విజ్ఞప్తి చేసిన బోధనేతర ఉద్యోగుల సంఘం నాయకుడు రఘోత్తం రెడ్డిపై ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగారు. జీతాల చెల్లింపులో రిజిస్ట్రార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటూ గత గురువారం రఘోత్తం రెడ్డి బహిరంగ లేఖ రాసిన విషయం విదితమే. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిపై లేఖలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదు. బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపడంలో రిజిస్ట్రార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని మాత్రమే లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రఘోత్తం రెడ్డికి సోమవారం రిజిస్ట్రార్ రమేష్ బాబు షోకాజ్ నోటీసు జారీ చేయడం గమనార్హం. ఈ నెల 25వ తేదీ లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని సూచించారు. సమస్య పరిష్కరించాల్సింది పోయి ఇలా కక్షసాధింపు చర్యలకు దిగడం సరికాదని బోధనేతర ఉద్యోగులు పేర్కొంటున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం



రంజిత్‌కుమార్ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో రంజిత్ కుమార్ (23) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, తిప్పమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు రంజిత్ కుమార్ బెంగళూరులో ఇన్ఫోసిస్ కంపెనీలో పని చేస్తున్నాడు. గత శనివారం బెంగళూరు నుంచి స్వగ్రామానికి రంజిత్‌కుమార్ వచ్చాడు.ఏమైందో తెలియదు కానీ, సోమవారం తమ ఇంటి పక్కనే ఉన్న గంగన్న గౌడ ఇంట్లో పైకప్పునకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఎంతో చలాకీగా ఉండే రంజిత్‌కుమార్ మృతితో గ్రామస్తులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగారు.

పంజరంలో చిలుకలా అధికారులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టని మైనింగ్ అధికారులు
- రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై 'పచ్చ' పెత్తనం సాగుతున్నా ఉన్నతాధికారుల మీనమేషాలు
- మండలాల్లో డమ్మీలుగా మారిన తహసీల్దార్లు
- ఎమ్మెల్యేల ఆగడాలపై నోరెత్తే పరిస్థితి లేదని పలువురి ఆవేదన



ఘోరాల పర్వం.. చర్యలు శూన్యం!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: భూకబ్జాలు, బెదిరింపులు, దొంగతనాలు జిల్లాలో నిత్యకృత్యమయ్యాయి. సహజ వనరులు దోపిడీకి గురవుతున్నా కన్నెత్తి చూడలేని పరిస్థితిలో అధికారులున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక, మద్యం అక్రమంగా తరలించిన వారిపై ఉక్కుపాదం మోపారు. కానీ ఇప్పుడు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే దిక్కు లేదు. మట్టి, ఇసుక, కంకర వంటివన్నీ జిల్లా దాటి ఇతర రాష్ట్రాలకు తరలి వెళుతున్నాయి. మైనింగ్, రిజిస్ట్రేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు డమ్మీలుగా మారారు. పంజరంలో చిలుకలా చూస్తూ ఉండిపోతున్నారు తప్ప చర్యలకు సాహసించడం లేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలకు పాలేరు పనిచేస్తున్నట్టుందని ఓ తహసీల్దార్ వాపోయారు.

ఏరీ మైనింగ్ అధికారులు..?

చాలా పోలీస్ స్టేషన్లలో మిస్సింగ్ కేసులు నమోదవుతుంటాయి. ఇప్పుడా కేసుల్లో మైనింగ్ అధికారులను కూడా చేర్చాలని జనంలో చర్చ జరుగుతోంది. తాడిపత్రిలో పెన్నానదిని లూటీ చేస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. రాప్తాడు నియోజకవర్గంలో ఎర్రమట్టిని వందల లోడ్లు తరలిస్తున్నప్పటికీ వాటివైపు చూడటం లేదు. శింగనమల నియోజకవర్గంలో ఏకంగా గ్రామస్తులు ట్రాక్టర్లకు అడ్డుగా పడుకుని నిరసన తెలిపారంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయొచ్చు. గార్లదిన్నె, కూడేరు, ఆత్మకూరు మండలాల్లో జరుగుతున్న మట్టి దోపిడీపై మైనింగ్ అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

వినతిపత్రాలు.. బుట్టదాఖలు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా భూకబ్జాల కేసులు రోజువారీ అయ్యాయి. కలెక్టర్ ఏ నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించినా భూకబ్జా బాధితులే ఎక్కువగా వస్తున్నారు. అనంతపురం రూరల్ పరిధిలో ఓ వ్యక్తి 50 ఏళ్ల కిందట కొన్న భూముల చుట్టూ టీడీపీ గూండాలు బౌండరీలు వేసి మరీ ఆక్రమించుకుంటున్న పరిస్థితి. రాయదుర్గం పట్టణంలో రోజూ సగటున రెండు భూకబ్జాల కేసులు నమోదవుతున్నాయి. అనంతపురం, గుత్తి ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. స్థానికంగా తహసీల్దార్లకు బాధితులు వినతిపత్రాలు ఇస్తుంటే అవి బుట్టదాఖలవుతున్నాయి. చివరకు కలెక్టర్‌కు ఇచ్చినా ఆయన కూడా వీసమెత్తు న్యాయం చేయలేక పోతున్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌లు బిక్కుబిక్కు..

ఏ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలో.. దేన్ని చేయకూడదో సబ్‌రిజిస్ట్రార్‌లకు తెలుసు. కానీ ఇప్పుడు ఏది చేయాలో ఏది చేయకూడదో ఎమ్మెల్యేలే నిర్ణయిస్తున్నారు. ఇటీవల తాడిపత్రిలో టీడీపీ నాయకుడి ఆదేశాల మేరకు మూడు రోజులు రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయాయి. రాప్తాడులో పెద్ద రిజిస్ట్రేషన్‌లు తమకు తెలియకుండా చేస్తే ఇంటికెళతావని సబ్‌రిజిస్ట్రార్‌ను టీడీపీ నేతలు బెదిరించారు. దీంతో భూములు కొనాలన్నా, అమ్మాలన్నా కమీషన్లు ఇచ్చుకోవాలన్న భయం బాధితులను వెంటాడుతోంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖకు ఇక్కడ డీఐజీ స్థాయి అధికారి ఉన్నా ఏమీ అనలేని దుస్థితి నెలకొంది.

గడిచిన ఆరు మాసాల్లో అధికారులకు అందిన వినతులు ఇలా....

భూకబ్జాలు	2,145
తప్పుడు రిజిస్ట్రేషన్లు	471
మట్టి, ఇసుక అక్రమ రవాణా	1,461
బెదిరింపులు, తదితరాలు	266

ఐపీఎస్ అధికారిని వేసినా..

తాడిపత్రిలో విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి, మట్కాకు అడ్డుకట్ట వేయాలని ఇటీవల ఐపీఎస్ అధికారి రోహిత్ కుమార్ చౌదరిని ఏఎస్పీగా పంపారు. కానీ ఆయన మాత్రం తన ఆఫీసుకే పరిమితమయ్యారనే విమర్శలున్నాయి.. స్థానిక టీడీపీ నేతల ఒత్తిడి మేరకు ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నారని ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికీ తాడిపత్రిలో గంజాయి, మట్కా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇంతదానికి ఇక్కడికి ఓ సీఐని వేస్తే సరిపోతుంది కదా అంటూ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు

- ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈఓ నరసింహారావు



అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలతో ప్రోత్సాహం అందిస్తామని ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) బీఎంవీ నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, ఎఫ్‌పీఓలు, రైతు సహకార సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. యూనిట్ విలువలో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే... 35 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. మిగతా 55 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. వేరుశనగ నూనె, చిక్కీల తయారీ వంటి వాటికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని, పొటాటో చిప్స్, చెక్కిలాలు, ఊరగాయలు, రోటీ మేకర్, రెడీ టు ఈట్ ప్రొడక్ట్స్, శనగపప్పు, బేకరీ ఉత్పత్తులు, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులు, బొరుగులు, రైస్ బేస్ట్ ప్రొడక్ట్స్, అరికానట్స్, చింతపండు తదితర మరో 20 నుంచి 30 రకాల ఉత్పత్తుల తయారీకి రాయితీలు వర్తిస్తాయని వెల్లడించారు. ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, వివరాలకు ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రీసోర్స్ పర్సన్ బి.హరీష్ (9676796974)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్
- 'దుర్గం'లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వివిధ సమస్యలపై 360 వినతులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిల్ సభ్యులు

రాయదుర్గం: ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపే బాధ్యత తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ కల్యాణ మంటపంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్వో మలోల, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 360 వినతులు అందాయి. ఎక్కువ భాగం భూ సమస్యలపైనే ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అర్జీల్లో 70 నుంచి 80 శాతం పరిష్కారం చూపుతున్నారని, వంద శాతం పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, మల్లికార్జున, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ వసంతబాబు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, సీపీఓ అశోక్ కుమార్, డీఎస్పీ రవిబాబు, పట్టణ, రూరల్ సీఐలు జయనాయక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసేలా చొరవ చూపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో పాటు బనాపురం మంజునాథ, పైతోట సంజీవ, శివకుమార్, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివ, రామాంజినేయులు, శ్రీరామిరెడ్డి, బషీర్, కృష్ణమూర్తి, దివాకర్, నిజాముద్దీన్, కో–ఆప్షన్ మెంబర్లు సజీర్, శ్రీనివాసులు, బాబు, దేవేంద్ర తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.డంపింగ్ యార్డు తొలగింపునకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో కంపోస్టు యార్డు నిర్మాణానికి స్థలం చూపాలన్నారు.
- దివ్యాంగురాలైన తనకు పెన్షన్ మంజూరు చేయాలని రహీనబేగమ్ విజ్ఞప్తి చేశారు. వీల్ చైర్‌లో వచ్చిన ఆమె వద్దకు స్వయంగా కలెక్టర్ వెళ్లి వినతి పత్రం స్వీకరించారు.
- పట్టణంలోని మసీదుల వద్ద వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ముస్లిం సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ పాఠశాలకు దారి, ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఖాజా వినతి పత్రం సమర్పించారు.
- ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని స్టీల్‌ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షుడు నాదల్‌ఆలీ కోరారు. డీ హీరేహాళ్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుడు అంజి, మురడిలో రస్తా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.

తీర్థయాత్రకు వెళ్లి తిరిగి రాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



భర్త రాజన్నతో మృతురాలు నాగలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి రూరల్: భర్తతో కలిసి తీర్థయాత్రకు వెళ్లిన తాడిపత్రికి చెందిన వివాహిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాశీ వద్ద ఈ ఘోర దుర్ఘటన జరిగింది. వివరాలు.. తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన నాగలక్ష్మి (53), రాజన్న దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా అందరికీ వివాహాలయ్యాయి. మండలంలోని బుగ్గ వద్ద రాజన్న పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. ముగ్గురు కుమార్తెలకూ పెళ్లిళ్లు కావడంతో తీర్థయాత్రలకు వెళ్లాలన్న కోరిక భార్యాభర్తలకు కలిగింది. ఈ నెల 3న తాడిపత్రి నుంచి 13 రోజుల పాటు అయోధ్య, ప్రయాగ్ రాజ్, కాశీ తదితర పుణ్యక్షేత్రాల సందర్శనకు బస్సులో వెళ్లారు. గత శుక్రవారం ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో పవిత్ర స్నానాలు ఆచరించారు. శనివారం రాత్రి కాశీలో విశ్వేశ్వరుడిని దర్శించుకుని తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలోనే కాశీ పట్టణానికి వంద కిలోమీటర్ల దూరంలో టీ తాగేందుకు డ్రైవర్ రోడ్డు పక్కన బస్సును నిలపగా.. వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి బస్సును ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన నాగలక్ష్మితో పాటు మరో ఆరుగురిని స్థానికంగా ఉండే ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాగలక్ష్మిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌కు తీసుకురాగా.. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. మృతదేహాన్ని సోమవారం గన్నెవారిపల్లి కాలనీకి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో నాగలక్ష్మి పక్కనే భర్త రాజన్న నిద్రిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని తలుచుకుని ఆయన గుండెలవిసేలా రోదించారు. మాజీ సర్పంచ్ లింగం కృష్ణయ్య తదితరులు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.



సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బోసిపోతున్న అనంతపురం టవర్‌క్లాక్ ప్రాంతం

ఇప్పుడే ఇలా.. ముమ్ముందు ఎలా..?



వేసవి ప్రారంభం కాకమునుపే సూరీడు సెగలు పుట్టిస్తున్నాడు. ఉదయం 10 గంటల వరకూ బాగానే ఉంటున్నా.. ఆ తర్వాత సుర్రుమంటున్నాడు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే వచ్చే రెండు, మూడు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరుకే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్క్ చేరుకునే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో మరింత భయాందోళన నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు, గొడుగు నీడలో వృద్ధురాలు, ఎండలో మహిళల అవస్థలు

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- సర్కారు తీరుపై కన్నెర్ర
- జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసన
- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్



అనంతపురంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ నాయకురాలు రమాదేవి



తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతపురం సెంట్రల్: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు కదం తొక్కారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనంతపురం శారదానగర్‌లోని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి అంశాన్నీ యాప్‌లలో చేయమని చెబుతుండటంతో అంగన్‌వాడీలపై తీవ్ర పనిభారం పడుతోందని వాపోయారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చడంతో పాటు వర్కర్‌లకు సెలవులు ఇవ్వాలని, కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని కోరారు. హెల్పర్ పదోన్నతులకు నిర్దిష్ట గైడ్‌లైన్స్ రూపొందించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి దహన సంస్కారాలకు రూ. 20 వేలతో పాటు బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, టీఏ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, అర్బన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు నక్షత్ర, రేవతి, సీఐటీయూ నగర కార్యదర్శి ముత్తూజ, సీఐటీయూ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాముడూరులో ఇరువర్గాల ఘర్షణ



తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్, వరలక్ష్మి

గుత్తి రూరల్: మాముడూరులో గొర్రె పిల్లలను ఉంచే జాలరీ విషయంలో సోమవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వరలక్ష్మి, అనిల్‌కుమార్‌లకు తమ ఇంటి సమీపంలో ఉండే రవి, చౌడప్ప, ఎల్లప్ప, రామాంజనేయులు, పెద్దయ్యలతో గత కొన్ని నెలలుగా భూమి విషయంలో వివాదం ఉంది. పలుమార్లు గొడవలు కూడా జరిగాయి. ఈ క్రమంలో గ్రామ శివారులో గొర్రె పిల్లలను ఉంచే జాలరీల ఏర్పాటు విషయంలో వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నారు. దాడిలో అనిల్‌కుమార్, తల్లి వరలక్ష్మి గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శతాధిక వృద్ధుడు కన్నుమూత


అమీరుద్దీన్‌సాబ్ (ఫైల్)

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన మున్సిపల్ విశ్రాంత ఉద్యోగి ఎస్.అమీరుద్దీన్‌సాబ్ (104) అనారోగ్యంతో సోమవారం ఉదయం 6.30 గంటలకు చనిపోయారు. ఈయన భార్య 40 ఏళ్ల క్రితమే మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సాయంత్రం బళ్లారి రోడ్డులోని ఖబర్‌స్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించినట్లు కుమారుడు మెహబూబ్‌బాషా తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి 15 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

శెట్టూరు: విద్యుత్ తీగలు తెగి మందపై పడటంతో అందులో 15 గొర్రెలు మృతి చెందిన సంఘటన మల్లేటిపురంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కురుబ గోవిందప్ప సుమారు 100 గొర్రెలతో తన పొలంలోనే మంద ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి మంద వద్దే నిద్రించాడు. గొర్రెల మంద నిద్రిస్తున్న స్థలం వద్దే విద్యుత్ మెయిన్‌లైన్ ఉంది. సోమవారం ఉదయం తెల్లవారుజామున మూడుగంట సమయంలో విద్యుత్‌తీగ తెగి గొర్రెల మందపై పడింది. మెరుపుతో కూడిన శబ్దం రావడంతో రైతు ఉలిక్కిపడి లేచాడు. రైతు వెంటనే లైన్‌మెన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. విద్యుత్‌షాక్‌కు గురికాకుండా జాగ్రతపడి గొర్రెలను మందనుంచి బయటకి తీశాడు. అయితే అప్పటికే 15 గొర్రెలు మృతి చెందాయి. విద్యుత్ వైర్లు పాతబడటం వల్లే తెగిపోయాయని గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ వెంకటేశులు, ఎంపీటీసీ ప్రహ్లాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కిష్టప్ప, సిద్ధలింగప్ప, గ్రామస్తులు రైతును పరామర్శించారు.

వివాహితపై అత్యాచారయత్నం

తాడిపత్రి రూరల్: బొడాయిపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన ఓ వివాహితపై బంధువైన అంకన్న అత్యాచారయత్నం చేశాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం బాధితురాలు ఇంట్లో జరిగిన విషయం తెలిపింది. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడు అంకన్నపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కాటమయ్య తెలిపారు.

బండయ్య.. ది గ్రేట్

• 103 ఏళ్లలోనూ చలాకీగా.. • వ్యవసాయం, జ్యోతిష్యంలోనూ అపార అనుభవం • ఆదర్శం.. విశ్రాంత ఉపాధ్యాయుడి జీవన ప్రస్థానం


కళ్యాణదుర్గం సబ్ ట్రెజరీ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులతో బండయ్య..


బండయ్య మాస్టార్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: ఆయనో విశ్రాంత ఉపాధ్యాయుడు. పెన్షన్ కోసం ఏటా సమర్పించే లైఫ్ సర్టిఫికెట్ తీసుకుని కళ్యాణదుర్గం సబ్ ట్రెజరీ కార్యాలయానికి వచ్చారు. ఎంతో చలకీగా కనిపించిన ఆయన్ను చూసి తోటి రిటైర్డు ఉద్యోగులు మల్లికార్జున, తిప్పేస్వామి, హంపన్న, అంజినప్ప, మారెన్న, విశ్వనాథ్, భగవాన్ దాస్ తదితరులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఆ మాస్టారు పేరు బండయ్య. 103 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యకరంగా ఉన్న ఆయన్ను పెన్షనర్ భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండయ్య విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘానికి తన వంతుగా రూ.5 వేల విరాళం అందజేశారు.

ఉద్యోగ ప్రస్థానం...

బ్రహ్మసముద్రం మండలం పొబ్బర్లపల్లికి చెందిన బండయ్య మాస్టారు 1922 జూలై 10న జన్మించారు. నాలుగో తరగతి వరకు చదివి జ్యోతిష్యం నేర్చుకున్నారు. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన చూసి ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. తొలి నెల జీతం రూ.30.10 పైసలు. 1978లో ఉద్యోగ విరమణ పొందే నాటికి జీతం రూ.90. ప్రస్తుతం ప్రతి నెలా రూ.26 వేల పెన్షన్ అందుకుంటున్నారు.

ఆదర్శ రైతుగా రాణింపు..

బండయ్య మాస్టారు ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామం పొబ్బర్లపల్లిలో వ్యవసాయంపై దృష్టి సారించారు. సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడితో ఆదర్శ రైతుగా రాణించారు. కొత్త రకం వంగడాలు పరిచయం చేస్తూ గ్రామంలోని రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు సాగారు. శ్రీశైలంలో సదాశివయ్య అన్న సత్రం చైర్మన్‌గా పనిచేశారు. పలుచోట్ల విరాళాలు సేకరించి నిత్యాన్నదాన సత్రాన్ని విజయవంతంగా నడిపారు

సాత్వికాహారమే ఆరోగ్య రహస్యం..



బండయ్య మాస్టారు ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం రెండు పూటల స్నానం చేస్తూ.. సాత్విక ఆహారం, మజ్జిగ, పాలు స్వీకరిస్తున్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల వయసు రీత్యా కంటి చూపు మందగించింది. ఈయన భార్య శివలింగమ్మ నాలుగేళ్ల క్రితం మరణించింది. ఇక ఏడుగురు సంతానంలో ఒకరు మృతి చెందారు. మిగిలిన ఆరుగురు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడ్డారు. ప్రస్తుతం కర్ణాటకలోని శ్రీరంగపట్నంలో కుమారుడు గౌరీ శంకర్‌తో కలిసి మాస్టారు ఉంటున్నారు.

ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు


'స్థానిక' ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

• కూలీలకు కాకుండా కాంట్రాక్టర్లతో పనులు ఎలా చేయిస్తారు?

రాయదుర్గం: కూటమి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు, అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆరోపించారు. ఈ పథకం కూలీలకు కాకుండా కూటమిలోని కొందరు కాంట్రాక్టర్లకు వరంగా మారిందన్నారు. సోమవారం రాయదుర్గంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన ఆయన జిల్లాలోని పలు మండలాల ఎంపీపీలు, సర్పంచులతో కలసి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో రవీంద్రారెడ్డి మాట్లాడారు. అధికార పార్టీ చెప్పిన వారికి ఉపాధి పనులను ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కూలీలతో కాకుండా ఉపాధి పనులను కాంట్రాక్టర్లకు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్‌కళ్యాణ్ ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు. ఉపాధి పనులు జరిగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సిన నేమ్‌బోర్డుల బిల్లుల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నేమ్‌బోర్డుల నిధులు తమ బంధువుల వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్న వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం మండల కన్వీనర్ రామాంజినేయులు, స్థానిక నాయకుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం

లేపాక్షి: మండలంలోని గౌరిగానపల్లిలో మహిళపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేశారు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో 26 ఏళ్ల మహిళ, అక్కడే ఉండే అశోక్, వెంకటేష్ కలిసి ఆదివారం రాత్రి మద్యం తాగారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న అశోక్, వెంకటేష్ ఆమెపై అత్యాచారం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌కు మెజిస్ట్రేట్ ఆదేశించారు.

మందకొడిగా రైతు రిజిస్ట్రేషన్లు

అనంతపురం అగ్రికల్చర్: ఆధార్ నంబర్ మాదిరిగా రైతులకు ఐడీ నంబర్లు కేటాయించేందుకు చేపడుతున్న రిజిస్ట్రేషన్ల కార్యక్రమం మందకొడిగా కొనసాగుతోంది. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే, కనీక సదుపాయాలు కల్పించకుండానే రంగంలోకి దించడంతో సమస్య తలెత్తుతున్నట్లు తెలిసింది. నాలుగు రోజులుగా అగ్రి స్టాక్ యాప్‌లో రైతుల రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారు. అయితే యాప్‌లో నెలకొన్న సాంకేతిక కారణాల వల్ల డీ-పట్టా భూములు కలిగిన రైతులకు, ఒకే సర్వే నంబరుతో ఇద్దరు, ముగ్గురికి భూములు కలిగిన వారికి ఐడీ నంబరు కేటాయింపు జరగడం లేదని సమాచారం. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నట్లు తెలిసింది. వీరందరికీ ఐడీ నంబరు లేకుండా మున్ముందు ప్రభుత్వ పథకాల వర్తింపులో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని చెబుతున్నారు. పంట నమోదు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు తదితర అన్ని రకాల పథకాలు వర్తించాలంటే రైతుకు తప్పనిసరిగా ప్రత్యేక ఐడీ నంబరు ఉండాలని షరతు విధించడంతో చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా వ్యాప్తంగా పీఎం కిసాన్ కింద రిజిస్టర్ అయిన 2.79 లక్షల రైతుల అకౌంట్ల ఆధారంగా ఐడీ నంబరు కేటాయిస్తున్నారు. నెలాఖరుకు 40 శాతం పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. ఇప్పటికి 32 వేల మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. గుంతకల్లు, తాడిపత్రి, కణేకల్లు, పెద్దవడుగూరు, గుత్తి మండలాల్లో మాత్రమే 2 వేలకు పైగా పూర్తి కాగా... కుందుర్పి, వజ్రకరూరు, శెట్టూరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, శింగనమల తదితర మండలాల్లో ఇంకా 200 నుంచి 400 మంది రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

యూట్యూబ్ చానల్ నిర్వాహకుడి అదృశ్యం

• ద్విచక్రవాహనంపై బండరాళ్లతో దాడి
• సంఘటన స్థలంలో దాడి చేసిన ఆనవాళ్లు
• కాలువ వరకు వెళ్లి ఆగిన పోలీసు జాగిలం



ఘటనా స్థలంలో పడి ఉన్న బైక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) తిరుమలరెడ్డి (ఫైల్)

గుంతకల్లు రూరల్: ఇంటి నుంచి పొలానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరిన యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు బి.తిరుమలరెడ్డి (45) బుగ్గ సంగాల వద్ద అదృశ్యమయ్యాడు. సంఘటన స్థలంలోనే మొబైల్, చెప్పులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బైక్‌పై బండరాళ్లతో దాడిచేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఎవరో పథకం ప్రకారం దాడిచేసి.. కిడ్నాప్ చేశారా.. లేక హత్య చేసి కాలువలో ఏమైనా పడేశారా అన్నది తెలియడం లేదు. దీంతో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన బి.వెంకటరెడ్డి కుమారుడైన బి.తిరుమలరెడ్డి కొన్నేళ్లుగా గుంతకల్లుకు వచ్చి నివాసముంటున్నాడు. బుగ్గ సంగమేశ్వర ఆలయ సమీపంలో తన తండ్రి నుంచి సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. తండ్రి పేరున బీవీఆర్ అనే యూట్యూబ్ చానల్ కూడా నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య కామేశ్వరి, అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న కూతురు మోనా ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బావమరిదిని చూసేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిన తిరుమలరెడ్డి ఆదివారం సాయంత్రం తిరిగి గుంతకల్లుకు చేరుకున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి పొలానికి పల్సర్ బైక్‌పై బయల్దేరాడు. అయితే మరో ఐదు నిమిషాల్లో పొలానికి చేరుకుంటాడనగా అదృశ్యం అయ్యాడు. బుగ్గ సంగాల వద్ద బండరాళ్లతో బైక్‌ను ధ్వంసం చేసి ఉంది. సమీపంలోనే చెప్పులు, మొబైల్ చెల్లాచెదురుగా పడ్డాయి. అటుగా వెళ్లిన రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అటు మద్దికెర, ఇటు గుంతకల్లు నుంచి భారీ సంఖ్యలో ప్రజలు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ శ్రీనివాస్, గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ టీపీ వెంకటస్వామి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాన్ని రప్పించగా.. సంఘటన స్థలం నుంచి గుట్ట వరకూ వెళ్లి అటు నుంచి పక్కనే ఉన్న హంద్రీ-నీవా కాలువ వద్ద ఆగిపోయింది. తిరుమలరెడ్డిని చంపి కాలువలో పడేశారా లేక, కిడ్నాప్ చేసి తీసుకెళ్లారా.. దుండగుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఏమైనా కాలువలో పడిపోయాడా.. ఇంకేమైనా జరిగిందా.. తిరుమలరెడ్డికి ప్రత్యర్థులు ఎవరు ఉన్నారు.. అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం

• రైతు సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శుల ధ్వజం
• గిట్టుబాటు ధర, పరిహారం కోసం డిమాండ్
• కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి పంట ఉత్పత్తులతో ధర్నా


ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

అనంతపురం అర్బన్: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రబీలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించాలని, మిరప, పత్తి, పప్పుశనగ, విత్తన జొన్నకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట పంట ఉత్పత్తులతో రైతులతో కలిసి ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో పండించిన మిరప, పత్తి, సీడ్ జొన్న, పప్పుశనగ పంటలకు గిట్టుబాటు ధరలేక దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రబీలో దాదాపు 57 వేల హెక్టార్లలో పప్పుశనగ సాగు చేశారన్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఎకరాకు దిగుబడి రెండు నుంచి మూడు క్వింటాళ్లు కూడా రాలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలన్నారు. మద్దతు ధర క్వింటాలు రూ.5,560ను రూ.10 వేలకు పెంచి కొనుగోలు చేయాలన్నారు. పత్తి పంట మద్దతు ధర రూ.7,250 నుంచి రూ.10 వేలకు పెంచి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. విత్తన జొన్న రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో దళారుల జోక్యం లేకుండా కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మిరపకు గిట్టుబాటు ధర కింటాలుకు రూ.50 వేలు ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ధర్నా వద్దకు విచ్చేసిన కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు వినతిపత్రం అందజేసి రైతుల పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఉపాధ్యక్షులు శివారెడ్డి, బీహెచ్ రాయుడు, మధుసూదన్, నాయకులు పాతులయ్య, వెంకటేష్, ఈరప్ప, నారాయణరెడ్డి, నాగమ్మ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి


కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న నాయకులు, వాల్మీకులు

అనంతపురం అర్బన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (ఎంవీఆర్‌పీఎస్), రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం (ఆర్‌వీఎస్‌ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, ఆర్‌వీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. వాల్మీకి/ బోయల చరిత్ర చాలా గొప్పదన్నారు. పురాతన పద్ధతులు, సంస్కృతి కార్యక్రమాలను ఇప్పటికీ కొనసాగిస్తున్నామన్నారు. అటవీ చట్టాల కారణంగా బోయలు అడవిని వదిలి జీవనోపాధికి మైదాన ప్రాంతాల్లోకి వలస వచ్చారన్నారు. రాష్ట్రంలో తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల్లో వాల్మీకి/ బోయలు ఎస్టీలుగా కొనసాగుతున్నారన్నారు. మిగిలిన జిల్లాల్లో కోస్తా, ముఖ్యంగా రాయలసీమ జిలాల్లో వాల్మీకులు/ బోయలుగా బీసీలుగా ఉండడం దురదృష్టకరమన్నారు. ఇది తమ జాతి అభివృద్ధికి గొడ్డలిపెట్టని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.జి.నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి దేవాదుల గోపాల్, ఆర్‌వీఎస్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్లపల్లి మోహన్, స్వర్ణక్క, శివప్రసాద్, సుఘోష్, న్యాయవాది చంద్రాచర్ల హరి, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కారం చూపాలి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సకాలంలో పరిష్కారం చూపాలని ఎస్పీ పి.జగదీష్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఎస్పీ 80 అర్జీలు స్వీకరించారు. సమస్యలను పరిశీలించి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు


జవాన్ లక్ష్మన్న భౌతికాయాన్ని వాహనంలో ఉంచి అంతిమ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : బీఎస్‌ఎఫ్ జవాన్ వడ్డే లక్ష్మన్నకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆర్మీ సిబ్బంది కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. ఢిల్లీ సమీపంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మరణించిన వడ్డే లక్ష్మన్న (33) భౌతికకాయం ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామం బ్రహ్మసముద్రానికి అధికారులు తీసుకువచ్చారు. కుమారుడిని చూసి తల్లిదండ్రులు సుశీలమ్మ, రామచంద్రప్ప గుండెలవిసేలా రోదించారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఉదయం జవాన్ భౌతికాయాన్ని ప్రతేక వాహనంలో ఉంచి అంతిమయాత్ర నిర్వహించారు. వందలాది మంది అభిమానుల మధ్య 'వీరుడా... నీకు వందనం.. అమరుడా లక్ష్మన్నా నీకు వందనం' అంటూ ఆర్మీ అధికారులు నినదించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి జైజవాన్ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం పశువైద్యశాల సమీపాన శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. బీఎస్‌ఎఫ్ ఎస్‌ఐ మాధవ్‌రావ్, హెడ్ కానిస్టేబుల్ మాంతేష్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర భద్రత బలగాలు కవాతు నిర్వహించారు. జవాన్ భౌతికకాయంపై ఉన్న జాతీయ జెండాను వారి కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం కుటుంబ సభ్యుల కడసారి వీడ్కోలు అనంతరం ఆర్మీ అధికారులు గౌరవ వందనం సమర్పించి మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. కార్యక్రమంలో సీఐ నీలకంఠేశ్వర్ , తహశీల్దార్ సుమతి, ఎస్ ఐ నారేంద్రకుమార్ , ఆర్ ఐ నాగిరెడ్డి, ఎంపీడీఓ నంద కిశోర్, ఎంఈఓ ఓబుళపతి, క్రిష్ణానాయక్, ఎంపీపీ చంద్రశేకర్ రెడ్డి జెడ్పీటీసీ ప్రభవతి రాజకీయ పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన టీచరు


డీఈఓ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి తండ్రి, విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: హోం వర్క్ రాయలేదనే కారణంతో మూడో తరగతి విద్యార్థిని టీచర్ చితకబాదిన ఘటన అనంతపురం రూరల్ మండలం కురుగుంటలోని శ్రీభారతి ప్రైవేట్ స్కూల్‌లో జరిగింది. శనివారం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థి తండ్రి తెలిపిన వివరాల మేరకు...అక్కంపల్లి పంచాయతీ ఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న నారాయణస్వామి కుమారుడు జయసూర్య శ్రీభారతి ప్రైవేట్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 15న విద్యార్థి హోం వర్క్ రాయలేదని గుర్తించిన టీచరు బెత్తంతో చితకబాదింది. విద్యార్థి చేతిపై వాతలు తేలాయి. సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత తండ్రికి విషయం చెప్పాడు. తర్వాత రోజు సెలవు రోజు కావడంతో సోమవారం విద్యార్థి తండ్రి నారాయణస్వామి, విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్ వద్దకు వెళ్లారు. విద్యార్థిని ఇష్టానుసారం ఎలా కొడతారని ప్రశ్నించగా...సదరు టీచర్ ఎదురుదాడికి దిగింది. దెబ్బలు కొట్టకుంటే పిల్లలకు చదువులు ఎలా వస్తాయని నిలదీసింది. విద్యార్థి తండ్రి, విద్యార్థి సంఘాల నాయకులు అక్కడి నుంచి డీఈఓ కార్యాలయానికి చేరుకుని డీఈఓ ప్రసాద్‌బాబుకు ఫిర్యాదు చేశారు. వాతలు పడేలా కొట్టిన టీచరుపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుల్లాయిస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మంజునాథ్, వంశీ, సాయి ఉన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా శేషాద్రి శేఖర్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఈ

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ ఎస్ఈగా శేషాద్రి శేఖర్‌ను నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం ఈఈగా పనిచేస్తున్న శేషాద్రిశేఖర్‌కు ఎస్ఈగా పదోన్నతి కల్పించారు. దీంతో సాయంత్రమే ఆయన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఈ సంపత్ కుమార్‌ను కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంగా బదిలీ చేశారు.

మహిళలకు రక్షణ కరువు

• వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నేతల ధ్వజం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, చిత్రంలో శ్రీదేవి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో మహిళలు, విద్యార్థినులకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ధ్వజమెత్తారు. ఇటీవల అన్నమయ్య జిల్లాలో యువతిపై హత్యాయత్నం, అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన ఘటనలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థినుల బాత్రూమ్‌లో బిహార్ యువకులు తొంగిచూసిన ఘటన కూటమి మంత్రి వర్గానికి కన్పించలేదా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా పరిగణించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు అండగా నిలుస్తామన్న పవన్ కళ్యాణ్ పూజలకే పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, విద్యార్థి విభాగం నాయకులు భారతి, నరేష్, మహేశ్వరి, శేఖర్, భాను, అనిత, చందు, రాజేష్, సూర్య, రమేష్, అరుణ్‌యాదవ్, కరుణాకర్, శివ, శశికళ, పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



విద్యార్థిని కరిష్మాను అభినందిస్తున్న శ్రీసాయి విద్యానికేతన్ యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల 1వ తరగతి విద్యార్థిని కరిష్మా ఇటీవల జిల్లాస్థాయి అనంత బాలోత్సవం పోటీల్లో ఇంగ్లీష్ రెయిమ్స్ సబ్‌జూనియర్ విభాగంలో మొదటి బహుమతి సాధించింది. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరిష్మాను కరస్పాండెంట్ కుసుమ పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, పీఈటీ పుట్లూరు కేశవరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

సెయింటాన్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

అనంతపురం రూరల్: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అనంత బాలోత్సవం పోటీల్లో సెయింటాన్స్ స్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సత్తా చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ సెల్వా మేరీ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగడంతో పాటు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం పట్ల గౌరవం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలి



సూచనలిస్తున్న డీపీఓ నాగరాజు

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ నాగరాజు అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పంచాయితీ వాహనాల ద్వారా చెత్తను సేకరించాలన్నారు. చెత్తను బయట పడేయకుండా చెత్త కేంద్రాల్లో వేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, పంచాయతీ సెక్రటరీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

గుత్తి కోట సుందరీకరణకు కృషి



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో గుత్తికోట పరిరక్షణ సమితి సభ్యులు

అనంతపురం కల్చరల్: గుత్తి కోట సుందరీకరణకు ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. గుత్తి కోట పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులో గుత్తికోట గురించి ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపీని సత్కరించారు. కార్యక్రమంలో సమితి గౌరవ సలహాదారుడు సూర్యనారాయణరెడ్డి, పద్మావతిరెడ్డి, ఉపాధ్యక్షుడు సుధాకరనాయుడు, కార్యవర్గ సభ్యులు బాబా సాహెబ్, దస్తగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు

అనంతపురం రూరల్: మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ మంగళవారం జిల్లాకు రానున్నట్లు మైనార్టీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళ్యాణదుర్గంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సాయంత్రం 3 గంటలకు అనంతపురంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం అవుతారని పేర్కొన్నారు. అనంతరం తిరిగి విజయవాడకు బయలుదేరుతారని వెల్లడించారు.

చీనీకి తెగుళ్ల పోటు..!



- తెగుళ్లు ఆశించడంతో ఎండిపోతున్న చీనీ చెట్లు
- దిగుబడి అంతంత మాత్రమే
- అప్పులు చేసి పంటల సాగు
- రైతన్నలకు తప్పని నిరాశ



యర్రగుంట వద్ద సాగులో ఉన్న చీనీ తోట

రాప్తాడు: ఆరుగాలం శ్రమించి చీనీ పంటను సాగు చేసిన అన్నదాతలకు నష్టాలే మిగులుతున్నాయి. ఇటు తెగుళ్లను నియంత్రించలేక.. అటు క్రిమి సంహారక మందులను కొనలేక లబోదిబోమంటున్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల్లో ఎక్కువగా చీనీ, అరటి, దానిమ్మ, మామిడి, సపోట, జామ వంటి పంటలను విరివిరిగా సాగు చేస్తారు. చీనీ పంటను దాదాపుగా 20,682 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అయితే రైతులను చీనీ పంట నట్టేట ముంచుతోంది. చీనీ పంటకు ఎక్కువగా ఆకుముడత, నల్లిపురుగులు, పండ్ల రసాన్ని పీల్చే రెక్కల పురుగులు, బంక తెగులు, వేరుకుళ్లు, బూడిద తెగుళ్లతో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న చీనీ చెట్లు నిట్టనిలువునా ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

వేరుకుళ్ల తెగులు..

వేరుకుళ్ల తెగుళ్ల నివారణకు రంగపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటడం శ్రేయస్కరం. వ్యాధి సోకిన తొలిదశలోనే గమనించి చెట్టుకు నీరు కట్టి మరుసటి రోజు కార్బండిజిమ్ 2 గ్రాములు, లేదా మాంకోజెబ్ 2.5 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా చెషంట్ మందును 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా 1 శాతం బోర్డో మిశ్రమాన్ని చెట్ల పాదుల్లో నేల తడిచేలా పోయాలి. సేంద్రియ ఎరువులు పట్టి రోట్టె ఎక్కువగా వాడాలి. 1 కిలో ట్రికో డెర్మా కల్చరును 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండితో కలిపి 15 రోజులు మాగబెట్టి, చెట్టుకి 10 కిలోల చొప్పున పాదిలో వేసి కలియబెట్టాలి. ఒక కిలో యూరియా 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఉపయోగం.

బంక తెగులును 'మాంకోజెబ్'తో అరికడదాం..

బంక తెగుళ్ల నివారణకు నీరు త్వరగా ఇంకిపోయే పొలాల్లో మొక్కలు నాటాలి. చెట్టు చుట్టూ పిల్ల పాదికట్టి నీరు మొదలుకు తగలకుండా చూడాలి. పిల్ల పాది, చెట్టు మొదలు నుంచి 1.5 అడుగుల దూరంలో ఉండాలి. బంక కారీ కుళ్లిన బెరడును పూర్తిగా గోకి బోర్డోపేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు, లేదా మాంకోజెబ్ పేస్ట్ పూయాలి. క్రమం తప్పక ముందు జాగ్రత్తగా బోర్డోపేస్ట్ మొదళ్లకు పట్టించాలి. కొమ్మలపై వచ్చే బంక తెగులు నివారణకు లీటర్ నీటికి కార్బెండిజిమ్ 1 గ్రా, కలిపి చెట్టుపై 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. మాంకోజెబ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపిన ద్రావణం చెట్ల పాదులో పోయాలి.



ఎండపాడ తెగుళ్లు సోకిన చీనీ కాయ

భయపెడుతున్న 'ఎండపాడ తెగులు'

ఎండపాడ తెగుళ్లు ఎక్కువగా ఎండకు వ్యాప్తి చెందుతుంది. ఈ తెగుళ్ల వలన కాయకు పసుపు రంగులో మచ్చలు ఏర్పడుతాయి. గాళికాయ సైజులో కాయలు ఉన్నప్పుడే మామూలు సున్నం (రాళ్ల సున్నం) నీళ్ల కలిపి పిచికారీ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఎండ ఎక్కువగా ఉన్న కాయలకు మచ్చ రాదు.

రసం పీల్చే 'డాగు పురుగు'

డిమాండ్ వచ్చే వరకు కాయలను చెట్టు మీద ఉంచడానికి రైతులకు ధైర్యం చాలడం లేదు. చెట్టు మీద ఉన్న కాయలకు డాగు పురుగు ఆశిస్తోంది. ఈ పురుగు కాయకు రంధ్రం చేస్తూ రసం పీల్చుతోంది. ఈ రంధ్రంలోకి శిలీంద్రాలు, తెగుళ్లు ఆశించి కాయలను కుళ్లిపోయేలా చేస్తున్నాయి. నాలుగైదు రోజులకు కాయ లోపల కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. సకాలంలో గుర్తించి మందులను పిచికారీ చేయకుంటే తెగుళ్ల కారణంగా కాయలు కుళ్లిపోయి దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. ఈ తెగుళ్లకు భయపడి రైతులు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది.

పట్టించుకోని ఉద్యాన అధికారులు

జిల్లాలో ఉద్యాన పంటలకు నియోజకవర్గంలోని ఆరు మండలాలు పెట్టింది పేరు. వేల హెక్టార్లలో చీనీ, అరటి, దానిమ్మ, మామిడి, సపోట తదితర పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. అన్నదాతలకు సరైన సమయంలో ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలిచ్చిన దాఖలాలు లేవు. అధికారుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా కనిపించడం లేదు. రైతులు దిక్కుతోచక పచ్చని పంటలను నరికేసుకుంటున్నారు. నెలల తరబడి అధికారులు కనిపించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

చీనీ సాగు ఇలా

మండలం	ఎకరాలు
రాప్తాడు	4,165
ఆత్మకూరు	4,086
అనంతపురం రూరల్	3,999
కనగానపల్లి	4,140
చెన్నేకొత్తపల్లి	2,395
రామగిరి	2,395

డాగు పురుగు ఆశిస్తోంది



చీనీ కాయలకు డాగు పురుగు ఆశిస్తోంది. పురుగు వల్ల కాయలు దెబ్బతింటున్నాయి. కాయలకు రంధ్రం వేసి రసం పీల్చడంతో కుళ్లిపోతున్నాయి. 7 ఎకరాల్లో 1,300 చెట్లు సాగులో ఉన్నాయి. కాయలతో చెట్టు నిండుగా ఉన్నాయి. వీటికి డాగు పురుగు ఆశించకుండా మందు పిచికారీ చేస్తున్నాను. అయినా ప్రయోజనం లేక విక్రయించాల్సి వస్తోంది.

– రామలింగా రెడ్డి, రైతు, గంగలకుంట

చీనీ చెట్లు ఎండుతున్నాయి



నాలుగు ఎకరాల్లో చీనీ తోట సాగు చేశా. వేరుకుళ్లు, బంక తెగుళ్లతో చీనీ చెట్టు అక్కడక్కడా ఎండు ముఖం పట్టాయి. ఏ మందులు పిచికారీ చేయాలో దిక్కుతోచడం లేదు. ఏ మందులు వాడితే పొలం ఏమవుతుందో అని ఆందోళనంగా ఉంది. అధికారులు సలహాలు ఇస్తే చీనీ సాగులో తెగుళ్లను నివారించుకుంటాం.

– శివారెడ్డి, రైతు, యర్రగుంట

యాజమాన్య పద్ధతులు పాటించాలి



చీనీ కాయలకు ఆశిస్తున్న పురుగులు నివారణకు సకాలంలో జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తోట చుట్టూ సోలార్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తే వాటి వెలుగుకు పురుగులు కాయలను ఆశించవు. సాయంత్రం వేళ పొలంలో పొగ పెట్టాలి. పెండాల్ మందును పిచికారీ చేయాలి. చీనీలో యాసమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు.

– రత్నకుమార్, హెచ్ఓ, రాప్తాడు

విజయనగర వైభవం స్ఫూర్తిదాయకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: యుద్ధరంగంలోనే కాకుండా సంగీత, సాహిత్య రంగాల్లో కూడా విశేష ప్రావీణ్యాన్ని సాధించిన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు భారతదేశానికే తలమానికమని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. ఎస్కేయూలో శ్రీకృష్ణదేవరాయ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విజయనగర సాహితీ వైభవం.. తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయలు తుళు భాషకు చెందిన వారైనప్పటికీ.. తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (బళ్లారి) చరిత్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. తిప్పేస్వామి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.నరసింహన్, సదస్సు కన్వీనర్ డాక్టర్ చాగంటి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



మాట్లాడుతున్న ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి గ్రామంలో మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక అనంతపురం కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. శివలింగం పైన ఉండే మూడు విభూది రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తు అన్నారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని తెలిపారు. అందుకే మధ్యలో ఉండే విభూది రేఖకు ఎర్రని బొట్టు పెడతారన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానాన్ని తెలియజేయడమే అన్నారు. శివరాత్రిని మోక్ష రాత్రి అంటారని గుర్తు చేశారు. అందరూ మోక్షం పొందాలన్నదే శివరాత్రి పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు చిట్టి బాబు, ఇందిర, విజయ, నాగమణి, ప్రసన్న, లక్ష్మి నారాయణమ్మ, నాగేశ్వరి, నాగిరెడ్డి, నీలావతి, నాగేష్ పాల్గొన్నారు.

ఘనంగా రామకోటి తిరునాల



తిరునాలలో భక్తుల సందడి

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో సోమవారం రాత్రి రామకోటి తిరునాల ఘనంగా నిర్వహించారు. సీతారాములను దర్శించుకోవడానికి స్థానికులే కాక పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. తిరునాల సందర్భంగా చెరుకు గడల అమ్మకాలు, గాజుల అంగళ్లు, నోరూరించే తినుబండారాలు, చిన్నారులను ఆకట్టుకునే ఆట వస్తువుల దుకాణాలు జోరుగా సాగాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దవడగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏటా అశ్వత్థం మూడో ఆదివారం తిరునాల మరుసటి రోజు రామకోటి తిరునాల జరగనున్నట్లు ఆలయ పర్యవేక్షకుడు చింతా నరసింహులు తెలిపారు.

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామ సమీపంలోని కొండపై ఉన్న దొణరామేశ్వరాలయంలో మాఘమాసం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: ప్రతి ఎకరాకు సాగు నీరు–ప్రతి గ్రామానికి తాగు నీరు సాధనకు ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ కడప నగరంలో జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామానికి తాగు నీరు అందించే వరకు రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. మహాసభలకు రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం కార్యదర్శి రామాంజనేయులు, సరస్వతి, లలితమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీలో అడ్డగోలు వసూళ్లు

- డిమాండ్ ఉన్న లైన్లలో కండక్టర్ల టికెట్ల బేరం
- డబ్బు తీసుకుని టికెట్లు ఇవ్వకుండా దోచుకుంటున్న వైనం
- ప్రయాణికుల నుంచి అదనంగా దోపిడీ
- చోద్యం చూస్తున్న అధికారులు



అనంతపురం క్రైం: ఆర్టీసీలో కొంత మంది కండక్టర్లు, డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అదును చూసుకుని ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. గతంలో ప్రయాణికుడి నుంచి డబ్బు తీసుకుని టికెట్ ఇవ్వకుండా పట్టుబడితే నెలలు, సంవత్సరాల తరబడి సదరు వ్యక్తిని విధుల నుంచి తొలగించేవారు. ప్రస్తుతం అటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కొంత వెసులుబాటు కల్పించారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంత మంది కండక్టర్లు ప్రయాణికుల నుంచి టికెట్టు ధరపై అదనంగా డబ్బు తీసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా ఆర్టీసీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

ఇటీవల జరిగిన సంఘటనలు ఇలా:

- జనవరి 16వ తేదీన తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీసు నంబర్ 6969లో డ్యూటీలోని డ్రైవర్ బెంగళూరుకు వెళ్లేందుకు ఇద్దరు ప్రయాణికుల నుంచి రూ.450 వసూలు చేశారు. సీట్లు ఖాళీ లేకపోవడంతో డ్రైవరు వెనుక సీటులో కూర్చుంటామని ప్రయాణికులు అభ్యర్థించారు. ప్రయాణికులను పక్కకు తీసుకెళ్లి టికెట్టు ధరకు అదనంగా ఇస్తే తీసుకెళతా.. లేదంటే మీ ఇష్టమని చెప్పడంతో వారు అందుకు అంగీకరించారు. దీంతో సుమారు రూ.320 ఉన్న టికెట్‌కు రూ.450 వసూలు చేశారు.
- ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం బళ్లారి నుంచి అనంతపురం బస్టాండుకు వస్తున్న ఆర్టీసీ బస్సులో బాషా అనే కండక్టరు రూ.180 తీసుకుని ముగ్గురికి టికెట్లు ఇవ్వకుండా ఆ డబ్బును తన జేబులో వేసుకున్నారు. ఆ లైనుపై రావాల్సిన స్క్వాడ్ కాకుండా రాయదుర్గం డిపో స్క్వాడ్ వచ్చింది. తనిఖీ అధికారులు కండక్టరు ఇచ్చిన టికెట్లను టిమ్ మిషన్‌లో తనిఖీ చేయగా వ్యక్తులు ఎక్కువగా ఉండి టికెట్లు తక్కువ కొట్టినట్లు పసిగట్టారు. ముగ్గురు కుటుంబ సభ్యుల నుంచి రూ. 200 తీసుకున్న కండక్టర్ వారికి రూ.20 వెనక్కు ఇచ్చారు. టికెట్లు మాత్రం ఇవ్వలేదు. ఈ విషయంపై ప్రయాణికులను ఆరా తీయగా వారు జరిగిన విషయాన్ని అధికారులకు వివరించారు. వారి ఫిర్యాదు తీసుకుని అధికారులు వెళ్లిపోయారు. అనంతరం ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది తెలియలేదు.
- ఫిబ్రవరి 9వ తేదీన తిరుపతికి వెళ్లే ఆర్టీసీ ఇంద్ర సరీసు బస్సులో సీటు కోసం ఓ జర్నలిస్టు టికెట్ కౌంటరు వద్దకు వెళ్లాడు. అత్యవసరంగా వెళ్లాల్సి ఉందని.. తనకు ఓ సీటు కావాలని అడిగాడు. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీల కోటాలో ప్రతి బస్సులో 8, 9 నంబరు సీట్లు ఖాళీగా ఉంచుతారు. ఎవరు రాని పక్షంలో ఆ సీట్లలో ప్రయాణికులను అనుమతిస్తారు. బస్సులో ఈ సీట్లు తప్పా ఖాళీగా లేవని తెలిసీ ఆ సీటు కేటాయించాలని కోరాడు. కాగా స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి అనుమతి లేకుండా సీటు ఇవ్వడం కుదరదని ఆర్టీసీ అధికారులు చెప్పారు. అయితే జర్నలిస్టు పక్కకు వెళ్లగానే 9 నంబర్ సీటుకు అదనంగా డబ్బు వసూలు చేసుకున్నారట.. ఈ విషయం తెలిసీ అధికారులను నిలదీస్తే నీకు సీటు ఇస్తున్నామని చెప్పి నమ్మించారట. ఆర్టీసీ ఆదాయానికి కృషి చేయాల్సిన అధికారులు వారి జేబులు నింపుకోడానికి తాపత్రయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

రాప్తాడు రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అనంతపురం రూరల్ మండల సీపీఐ కార్యదర్శి మేకల రమేష్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. రైతులకు పంటల బీమా, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ పథకం, తల్లికి వందనం తదితర పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో పోరుబాట పడతామన్నారు. సమావేశంలో రాప్తాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పి.రామకృష్ణ, అక్కులన్న, గోవిందు, యుగంధర్ రెడ్డి, జీపీ ఓబులేసు, తిరుపాల్ నాయక్, రెడ్డప్ప, కుల్లాయప్ప, మహేష్, వెంకటరాముడు, వేణు, పాండు, విజయ్, రామాంజనేయులు, అదెప్ప పాల్గొన్నారు.

శ్రీనివాసులుకు డాక్టరేట్



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధన చేసిన ఎం.శ్రీనివాసులుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. మేథమేటిక్స్ విభాగంలో డాక్టర్ ఆర్.భువన విజయ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ వేరియస్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ ఏ ప్లాట్ ప్లేట్ విత్ థర్మల్ రేడియేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు. శింగనమల మండలం నాగలగుడ్డం తాండాకు చెందిన ఎం.శ్రీనివాసులు ప్రస్తుతం జెడ్పీహెచ్ఎస్ కేసేపల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

భూ కబ్జాదారులపై కేసు నమోదు

అనంతపురం: భూ కబ్జాదారులపై అనంతపురం త్రీ టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇదివరకు 13 మందిపై కేసు నమోదు కాగా.. తాజాగా సోమవారం ఐదుగురిపై భూ కబ్జా కేసులు నమోదు చేశారు. అనంతపురం త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యారణ్య నగర్‌లో నివాసం ఉంటున్న కొమర్ల విజయ్ కృష్ణకు సర్వే నంబర్ 89/9లో మూడున్నర సెంట్లు, 91/6లో 12 సెంట్లు, అలాగే 92/2లో 30 సెంట్లు, మరికొన్ని సర్వే నంబర్లలో కలిపి 114 సెంట్లు పిత్రార్జిత ఆస్తి ఉంది. ఈ భూమికి పక్కనే ఈశ్వర్ ప్రసాద్, కృష్ణమూర్తి, పసుపులేటి రామన్నకు చెందిన భూమి ఉంది. జనవరి 30వ తేదీన కొంత మంది వ్యక్తులు ప్రజా సంఘం ముసుగులో తాత్కాలిక గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయం తెలిసిన బాధితులు భూమి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. కొందరు వ్యక్తులు వారిని తిట్టి బెదిరించారు. కొమర్ల విజయ కృష్ణ ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో భూ కబ్జా (ల్యాండ్ గ్రాబింగ్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అక్రమంగా, దౌర్జన్యంగా భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

మచ్చా రామలింగారెడ్డిపై కేసు కొట్టివేత

అనంతపురం: మచ్చా రామలింగారెడ్డిపై కేసు కొట్టివేస్తూ అనంతపురం జిల్లా మొబైల్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. వివరాలు.. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 2011లో సినీతారల క్రికెట్ మ్యాచ్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని అనంతపురం ఏఆర్ ఎస్పీ మురళీధర్ ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. పలు సెక్షన్లు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి విదితమే. ఇందుకు సంబంధించి అనంతపురం జిల్లా మొబైల్ కోర్టులో కేసు నడిచింది. మచ్చా రామలింగా రెడ్డి తరపున న్యాయవాది అబ్దుల్ రహమాన్ వాదించారు. పోలీసులు అక్రమంగా కేసు పెట్టారని.. ఈ కేసులో మచ్చా రామలింగా రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని వాదించారు. వాదోపవాదనల అనంతరం జిల్లా మొబైల్ కోర్టు జడ్జి సుజిన్ కుమార్.. మచ్చా రామలింగారెడ్డిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగర శివారులోని ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద కంపచెట్లలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. వారి నుంచి రూ.23,640 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం దేవాదయ శాఖ స్పెషల్ ఆఫీసర్ వన్నూస్వామి, ఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.8,24,413, శాశ్వత హుండీలు రూ.5,09,968, శీఘ్ర దర్శనం టిక్కెట్లు రూ.2,36,000, విరాళాలు రూ.30,394, తలనీలాల టిక్కెట్లు రూ.17,650, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.300 మొత్తం 14,06,325 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.